నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 14 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఎవరెస్టు శిఖరంపై మనోళ్లు



ఎవరెస్ట్ శిఖరంపై ఎంజేపీ విద్యార్థినులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 13 : మండలంలోని బాబాపూర్ మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలకు చెందిన విద్యార్థినులు హిమ బింధు, బిక్కుబాయి ఎవరెస్టు శిఖరాన్ని అధి రోహించారు. గత నెల 25న నేపాల్‌కు వెళ్లిన విద్యార్థులు 27న ఎవరెస్టు శిఖరంపైకి బయలు దేరారు. శుక్రవారం శిఖరంపైకి చేరుకొని శభాష్ అనిపించుకున్నారు. బీసీ గురుకుల సొసైటీ రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబాబాద్, నిజామాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి మొత్తం 20 మంది విద్యార్థులు శిఖరం ఎక్కడానికి వెళ్లినట్లు తెలిసింది. హిమబింధు, బిక్కుబాయిని పాఠశాల ప్రిన్సిపాల్ రత్నబాయి తదితరులు అభినందించారు.





చింతపెల్లికి వెళ్లే మార్గంలో నరికిన హరితహారం చెట్లు ఇవే..

## హరిత చెట్లపై గొడ్డలి వేటు

*కేసీఆర్ సర్కారు 'హరితహారం'లో భాగంగా నాటిన మొక్కలపై ఓ వ్యక్తి గొడ్డలి వేటు వేశాడు. ఈ ఘటన దండేపల్లి మండలం చెల్కగూడెంలో శుక్రవారం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముత్యంపేట నుంచి చింతపెల్లికి వెళ్లే రహదారిలో చెల్కగూడెం వద్ద రోడ్డుకు ఎడమ వైపున హరితహారం మొక్కలు నాటారు. నేడు అవి ఏపుగా పెరిగి ఆ రూట్లో వెళ్లేవారికి ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన పొలానికి అడ్డుగా ఉన్నాయనే ఉద్దేశంతో ఎలాంటి అనుమతులు లేకుండా 35కు పైగా చెట్లు నరికివేశాడు. దీంతో ప్రకృతి ప్రేమికులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పత్తిపాక మధుకర్‌ను వివరణ కోరగా.. చెట్లు నరికిన సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేశామని, ఫైన్ చెల్లించాలని ఆదేశించామన్నారు. నోటీసుకు స్పందించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.*

*- దండేపల్లి, జూన్ 13*

## ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 13 : జిల్లాలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ నమోదు చేయించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్‌లో విద్య, గిరిజన సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, బ్యాంకు, తపాలా, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో ఆధార్ నమోదు కేంద్రాలు పని చేయాలని, ఐదేళ్లు, పదిహేనేళ్లు దాటిన వారు ఆధార్ బయోమెట్రిక్ చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 102 గిరిజన గ్రామాల్లో ప్రధానమంత్రి జూగా పథకం కింద శిబిరాలు నిర్వహిస్తున్నందున



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆధార్ లేని వారందరినీ గుర్తించి నమోదు చేయించాలన్నారు. ఆధార్ నమోదు కేంద్రాలు, ఆధార్ కార్డులపై అభ్యంతరాలుంటే కలెక్టరేట్ భవనంలోని ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ యుఐడీ అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ సౌబన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, విద్య, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, సీఎస్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.



ఆలయ గోపురం మీద ఏర్పడిన పగుళ్లు

## వేంకటేశ్వరాలయ గాలి గోపురానికి పగుళ్లు

మంచిర్యాల అర్బన్, జూన్ 13 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలోగల వేంకటేశ్వర స్వామి టెంపుల్ గోపురానికి పగుళ్లు ఏర్పడ్డాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలో శుక్రవారం సోషల్ మీడియాలో వైరలయ్యాయి. మార్కెట్ ఏరియాలో ఆలయం ముందున్న దుకాణాలను రోడ్డు వెడల్పులో భాగంగా తొలగిస్తుండగా, ఆ కారణంగానే ఆలయ గోపురానికి కూడా పగుళ్లు ఏర్పడ్డాయని హిందూ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆలయ కార్యనిర్వహణాధికారి ముక్త రవిని వివరణ కోరగా.. గోపురం పగుళ్లకు.. రోడ్డు విస్తరణ పనులకు ఎలాంటి సంబంధం లేదని, మే-లో పడిన పిడుగులకు గోపురానికి పగుళ్లు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, ఎండోమెంట్ అధికారులు ఆలయ రెనోవేషన్ కోసం నిధుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపిస్తున్నట్లు రవి వివరించారు.

## ఏసీబీ డీఎస్పీగా మధు



బాధ్యతలు స్వీకరిస్తున్న మధు

సీసీసీ నస్పూర్, జూన్ 13 : ఆదిలాబాద్ రేంజ్ అవినీతి నిరోధక శాఖ డీఎస్పీగా జీ మధు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీసీసీ నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా ఏసీబీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టగా ఏసీబీ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన విజయ్‌కుమార్ కరీంనగర్ రేంజ్ ఏసీబీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సిద్దిపేట ఏసీపీగా పనిచేసిన జీ మధు ఆదిలాబాద్ రేంజ్, మంచిర్యాల అవినీతి నిరోధక శాఖ కార్యాలయానికి బదిలీపై ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ రేంజ్ పరిధిలో అవినీతిని రూపుమాపడానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు లంచాల కోసం డిమాండ్ చేస్తే నేరుగా ఏసీబీ ఆఫీస్‌కు వచ్చి పిర్యాదు చేయవచ్చని, టోల్‌ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూన్ 13 : జిల్లాలో నిరక్షరాస్యులైన ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో న్యూ ఇండియా లిటరీ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 ఏళ్ల పై బడిన 1.20 లక్షల మంది నిరక్షరాస్యులున్నట్లు గుర్తించారని, మొదటి విడుతలో 30,600 మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కాసిపేట మండలాన్ని ఎంపిక చేసి వంద శాతం అక్షరాస్యతగా మండలంగా మార్చడం జరిగిందన్నారు. జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, జిల్లా షెడ్యూల్డు కులాల సహకార సంస్థ ఈడీ దుర్గా ప్రసాద్, డీఆర్‌డీవో కిషన్ పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ ఆధార్ కలిగి ఉండాలి

మంచిర్యాల జిల్లాలో ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో యుఐడీ అసిస్టెంట్ మేనేజర్ మహ్మద్ శౌభన్, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళ, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆధార్ కార్డులో మార్పుల కోసం నివాస ధ్రువీకరణ పత్రాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని, తహసీల్దార్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఏడుగురి అనాథలకు ఆధార్‌కార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఈవో యాదయ్య, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

## సింగరేణి డైరెక్టర్(పా)గా గౌతం పొట్రు

శ్రీరాంపూర్, జూన్ 13 : సింగరేణి సంస్థకు 11 ఏళ్ల తర్వాత ప్రభుత్వం డైరెక్టర్(పా)ను నియమించింది. 2014 ఐఏఎస్ బ్యాచ్‌లో13వ ర్యాంకు సాధించిన గౌతం పొట్రును పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్(పా)గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం గుల్లపూడి గ్రామం. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన సివిల్స్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా తెలంగాణకు పోస్టింగ్‌వచ్చింది. ఇప్పటి వరకు

### 11 ఏళ్ల తర్వాత నియామకం

ఆయన రాష్ట్రంలో సెర్ప్ సీఈవోగా, మేడ్చెల్ కలెక్టర్‌గా పనిచేశారు. తాజాగా చేపట్టిన ఐఏఎస్ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం సింగరేణి సంస్థకు ఆయనను డైరెక్టర్(పా)గా నియమించింది. కాగా, గతంలో డైరెక్టర్(పా)గా విజయ్‌కుమార్ ఉండగా, ఆయన తర్వాత మరెవరినీ నియమించలేదు. ఇన్నాళ్లూ సంస్థలోని ఇతర డైరెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వచ్చారు.



గౌతం పొట్రు



గిరిజనేతరులు ఆక్రమించిన అటవీ ప్రాంతాన్ని కంప్యూటర్‌లో చూపుతున్న జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్

గిరిజనేతరులు ఆక్రమించిన అటవీ ప్రాంతం మ్యాపు



# గిరిజనం పేరిట అడవిని ఆక్రమించి!

## ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజనేతరుల చేతుల్లో 90 వేల ఎకరాలు

- ఒక్కో కుటుంబానికి 20 నుంచి 40 ఎకరాలపైనే...
- ఒక్క దిందాలో 16 మంది చేతిలో 472 ఎకరాలు
- ట్రైబల్స్‌ను పావులుగా వాడుకుంటున్న నాన్ ట్రైబల్స్
- అటవీశాఖ సర్వేలో ఆశ్చర్యపోయే విషయాలు



చింతలమానేపల్లి మండలం దిందాలో అటవీ అధికారులను అడ్డుకుంటున్న గిరిజనేతరులు (ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : సాధారణంగా అడవిలో పోడు వ్యవసాయం చేస్తున్నారంటే వారిని గిరిజనులనే అనుకుంటాం. కానీ, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పోడు వ్యవసాయం చేస్తున్న వారిలో గిరిజనుల కంటే.. గిరిజనేతరులే అధికంగా ఉన్నట్లు అటవీశాఖ సర్వేలో వెల్లడైంది. గిరిజనుల చేతిలో 80 వేల ఎకరాల పోడు భూములుండగా, గిరిజనేతరుల చేతిలో 90 వేల ఎకరాలున్నట్లు గుర్తించింది. జీవనోపాధి కోసం రెండో.. మూడో ఎకరాలు కాకుండా.. ఏకంగా ఒక్కో గిరిజనేతర కుటుంబం 20 నుంచి 40 ఎకరాలపైనే ఆక్రమించినట్లు సిబ్బంది స్పష్టం చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.

### ఒక్క దిందాలో 16 మంది చేతిలో 472 ఎకరాలు

జిల్లాలో గిరిజనులకంటే గిరిజనేతరులే అటవీ భూములను ఎక్కువగా ఆక్రమిస్తున్నారనడానికి ఈ ఘటనే ఉదాహరణ. చింతలమానేపల్లి మండలం దిందా గ్రామంలో దాదాపు గత పదిహేను రోజులుగా అటవీ అధికారులకు.. పోడు రైతులకు మధ్య వివాదం జరుగుతోంది. అటవీ భూమికి హద్దు వేసేందుకు ట్రెంచ్ తవ్వుతున్న అటవీ అధికారులను కొంత మంది రైతులు అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. ఈ గ్రామంలో ఎవరి దగ్గర ఎంత అటవీ భూములున్నాయనే దానిపై వివరాలు సేకరించిన అటవీ అధికారులకు విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. దిందా గ్రామ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాన్ని ఆక్రమించింది ఎక్కువగా గిరిజనేతరులేనని గుర్తించారు. అదీ కూడా జీవనోపాధి కోసం ఏ రెండో.. మూడో ఎకరాలు కాదు... ఏకంగా ఒక్కో కుటుంబం 20 నుంచి 40 ఎకరాల వరకు అడవిని నరికి ఆక్రమించుకున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. దిందా గ్రామంలో 16 మంది గిరిజనేతరుల చేతిలో 472 ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు వెలుగుచూసింది. ఈ ప్రాంతంలో మూడు.. నాలుగు ఎకరాల భూములకు హక్కు పత్రాలు ఉన్న గిరిజనులను ముందు పెట్టి.. గిరిజనేతరులు అటవీ అధికారులను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

### గిరినేతరుల చేతిలో 90 వేల ఎకరాలపైనే..

జిల్లాలో అటవీ భూములు సాగు చేసుకుంటున్న దాదాపు 23 వేల గిరిజనుల కుటుంబాల చేతిలో 80 వేల ఎకరాలుంటే.. దాదాపు 7 నుంచి 8 వేల మంది గిరిజనేతరుల చేతిలో 90 వేల ఎకరాల నుంచి లక్ష ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. గిరిజనులకు 2 నుంచి 5 ఎకరాల్లోపు పోడు భూములుంటే.. గిరిజనేతరులకు ఒక్కో కుటుంబానికి 20 ఎకరాలు మొదలుకొని 40 ఎకరాలపైనే అటవీ భూముల ఉన్నాయి. చింతలమానేపల్లి మండలం దిందా, బండెపల్లి గ్రామాల పరిధిలోనే వంద మంది గిరిజనేతరుల కుటుంబాల చేతిలో 10 వేల ఎకరాల అటవీ భూములు ఉన్నట్లు గుర్తించామని జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రివాల్ తెలిపారు. ఇంకా చింతలమానేపల్లి మండలం పరిధిలోని కోర్సిని, అడెపల్లి, గూడెం, శివపల్లి, కోయపల్లి, గంగాపూర్ గ్రామాల పరిధిలో, బెజ్జూర్ మండలం పరిధిలోని కుకుడ, పాపన్‌పేట్, పెంచికల్‌పేట్ మండలం పరిధిలోని కొండపల్లి, లోడ్‌పల్లి, జైహింద్‌పూర్, అగర్‌గూడ, దరోగపల్లి, బొంబాయిగూడ, రస్‌పల్లి, బాబాసాగర్ గ్రామాల పరిధిలో గిరిజనేతర కుటుంబాల చేతిలో వందలాది ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. ఒక్కో కుటుంబం పది ఎకరాలకు పైగానే అటవీ భూములను అక్రమించుకున్నది.

### గిరిజనులను ముందు పెట్టి..

అటవీ భూములను ఆక్రమించుకొన్న గిరిజనేతరులు.. తమ భూములను కాపాడుకునేందుకు గిరిజనులను పావులుగా వాడుకొంటున్నారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు గత ప్రభుత్వాలు, అటవీ అధికారులు ఎప్పుడో అటవీ హక్కుల కల్పించారు. కానీ, గిరిజనేతరుల చేతిలో పదెకరాలు మొదలుకొని 40 ఎకరాల వరకు భూములుండడంతో వారికి పట్టాలు దక్కలేదు. ఎలాంటి హక్కులు లేకుండా గిరిజనేతరులు చేతిలో అధికంగా ఉన్న భూములను స్వాధీనం చేసుకునేందుకు గ్రామాల్లోకి వెళ్లే అటవీ అధికారులను అడ్డుకునేందుకు గిరినేతరులు.. గిరిజనులను ముందు పెడుతున్నారు. ఇటీవల చింతలమానేపల్లి మండలం దిందా గ్రామంలో, పెంచికల్‌పేట్ మండలంలోని జైహింద్‌పూర్ అటవీ అధికారులను అడ్డుకున్నది గిరిజనేతరులే...

**కేసీఆర్ సర్కారులో 43 వేల ఎకరాలకు పట్టాలు**

*తరతరాలుగా అడవులపై ఆధాపడి జీవిస్తున్న గిరిజనులకు కేసీఆర్ సర్కారు మానవతా దృక్పథంతో పోడు పట్టాలు అందించి వారికి హక్కులు కల్పించింది. 2023లో జిల్లాలో సుమారు 43 వేల ఎకరాల అటవీ భూములకు పోడు పట్టాలు అందించి ప్రభుత్వ పథకాలు వర్తింపజేసి అడవిబిడ్డల మన్ననలు పొందింది.*

**జీవనోపాధి కోసం సాగు చేసుకుంటున్న భూముల జోలికి వెళ్లం**



*జీవనోపాధికోసం రెండు నుంచి నాలుగెకరాల వరకు సాగు చేసుకునే వారి జోలికి వెళ్లం. వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించం. గిరిజనులు సాగు చేసుకుంటున్న దాదాపు 80 వేల ఎకరాలకు హక్కు పత్రాలు ఇచ్చాము. ఈ భూముల్లో గిరిజనులు ఎలాంటి అభ్యంతరం లేకుండా సాగు చేసుకోవచ్చు. గిరిజనేతరుల చేతుల్లో 90 వేల ఎకరాలకుపైగానే అటవీ భూములు ఉన్నాయి. ఒక్కో కుటుంబం 10 ఎకరాల నుంచి 40 ఎకరాలకు పైగానే అటవీ భూమిని అక్రమించి సాగు చేసుకుంటున్నది. ఇలాంటి వారు కూడా వారి జీవనోపాధికి అవసరమైన భూమిని ఉంచుకొని అదనంగా ఆక్రమించుకున్న అటవీ భూమిని తిరిగి ఇచ్చేయాలి. అటవీ అధికారులు గ్రామాల్లోకి వెళ్లినప్పుడు గిరిజనులను ముందు ఉంచి గిరిజనేతరులు తమ భూములను కాపాడుకుంటున్నారు. ఈ విషయమై హక్కు పత్రాలు కలిగిన గిరిజనులు ఆలోచించాలి. వారికి అటవీ అధికారుల వలన ఎలాంటి ఇబ్బందులు కలుగవని గుర్తించాలి.*

***- నీరజ్‌కుమార్ టిబ్రివాల్, జిల్లా అటవీ అధికారి***



పెంచికల్ పేట్ మండలం జైహింద్‌పూర్‌లో అటవీ అధికారులను అడ్డుకుంటున్న గిరిజనేతరులు (ఫైల్)

## కవ్వాల్‌ను సందర్శించిన కలెక్టర్లు

*కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ అడవులను 2024బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు సౌరభ్ శర్మ (బద్రాద్రి కొత్తగూడెం),సాలోని చాబ్రా(ఆదిలాబాద్), హరీశ్ చౌదరి(వికరాబాద్), కారోలిన్ చింగ్థ్యాన్‌మవి (నిజామాబాద్), కోయాడ ప్రణయ్‌కుమార్ (నారాయణపేట్) శుక్రవారం ఉదయం సందర్శించారు. సఫారీలో గోండుగూడ గేట్ నంబర్-1 మీదుగా నీల్‌గాయి కుంట,బైసన్‌కుంట ప్రాంతాల్లో పర్యటించారు. దట్టమైన అటవీ అందాలను వీక్షించారు. వివిధ రకాల పక్షులు, వన్యప్రాణులను ప్రత్యేక్షంగా చూసి ఆనందం వ్యక్తం చేశారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నట్లు ఎఫ్ఆర్వో సుష్మారావు తెలిపారు.*

*- జన్నారం, జూన్ 13*



సఫారీలో వెళ్తున్న కలెక్టర్లు

## జీసీసీ మేనేజర్ సస్పెన్షన్



జీసీసీ మేనేజర్ బాలాజీ

జన్నారం,జూన్ 13 : మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయ మేనేజర్ బాలాజీని ఉట్నూర్ ఐటీడీఏపీవో ఖుష్బూగుప్తా శుక్రవారం సాయంత్రం సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఎం కార్యాలయానికి ఉత్తర్వులు పంపించినట్లు ఉట్నూర్ ఇన్‌చార్జి డీఎం సందీప్‌కుమార్ తెలిపారు. వేమనపల్లిలోని గిరిజన ఉన్నత పాఠశాలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని ఆరు నెలల క్రితం బహిరంగ మార్కెట్‌కు తరలిస్తుండగా, స్థానికులు పట్టుకున్నారు. ఈ విషయమై విచారణ చేపట్టిన పీవో విధులను నిర్లక్ష్యం చేసినందుకు మేనేజర్ బాలాజీ సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.